## క్లుప్తంగా

### ఈరన్నస్వామికి అభిషేక పూజలు


అలంకరణలో స్వామివారు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసంలో రెండవ సోమవారం కావడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

### యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా కౌలన్న


డి.కౌలన్న

పెద్దకడబూరు : యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని కొత్తగొల్లలదొడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.కౌలన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్ భూపాల్, శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 10న గూడూరులో జరిగిన జిల్లా మహాసభల్లో డి.కౌలన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

### ఉపాధి కల్పిస్తాం వలస వెళ్లొద్దు


కల్లుకుంటలో కూలీలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు

పెద్దకడబూరు : మండలంలోని గ్రామాలలో ఉపాధి కల్పిస్తామని ఎవరూ వలస వెళ్లొద్దని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు కోరారు. ఏపీఓ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కల్లుకుంట, జాలవాడి, కంబలదిన్నె గ్రామాల్లో తిరిగి కూలీలకు ఉపాధి పనుల గురించి అవగాహన కల్పించారు. పొలాల్లో పని చేస్తున్న కూలీలను, గ్రామాల్లో ఉన్న కూలీలను కలసి మాట్లాడారు. పొలాల్లో పనులు అయిపోయిన వారు, కూలీ పనులు లేక ఇళ్ల దగ్గరే ఉన్న వారు వలస వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

### క్షయ వ్యాధిపై అవగాహన


ఆదోని సెంట్రల్: క్షయ(టీబీ) వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ అనిల్ సాగర్, డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని అరుణ్ జ్యోతినగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశ వర్కర్లకు, టీబీ వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలు కన్నా ఎక్కువ రోజులు దగ్గు ఉంటే తప్పకుండా గళ్ల పరీక్షలు చేయించుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు షేకునబీ, షాహినా బేగం, ఎంపీహెచ్ఎస్ బాబురాజు పాల్గొన్నారు.

### గర్భిణులకు స్కానింగ్


క్యూలో నిల్చున్న గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా 593 మంది గర్భిణులకు స్కానింగ్ చేశారు. ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో గర్భిణులు రావడంతో కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో చాల మంది నిల్చోవాల్సి వచ్చింది. సూపరింటిండెంట్ డాక్టరు సుధా, డాక్టర్లు సుజిత, ఫాతీమా ఉన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం మల్లికార్జున

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో చదువుతున్న హెచ్‌బీ హరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున సోమవారం తెలిపారు. క్రికెట్‌లో బౌలర్‌గా సెలెక్ట్ అయినట్లు వెల్లడించారు. ఈ నెల 24, 25 తేదీలలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు చెప్పారు. పీఈటీలు నరసయ్య, ముజాయిద్దీన్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### ఆదోని ఈఈగా హరి

కర్నూలు సిటీ: జిల్లాలోని ఆదోని విద్యుత్ డివిజన్ ఈఈగా బి.హరి బదిలీఅయ్యారు. ఈ మేరకు సీఎండీ సంతోషరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొంతకాలంగా ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జ్ ఈఈగా రాజేష్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ పోస్టులో అనంతపురం డీపీఈ ఈఈ బి.హరిని నియమించారు.

# తెల్లబోయిన పత్తిరైతు

- ఆశాజనకంగా పత్తి దిగుబడి
- పెరిగిన పెట్టుబడి
- మార్కెట్‌లో దక్కని గిట్టుబాటు ధర
- ఆందోళనలో రైతాంగం

కౌతాళం: వ్యవసాయం ఆశలజూదంగా మారింది. తెల్లబంగారం సాగు చేసిన రైతాంగానికి సంతోషంతో పాటు ఆందోళన కూడా తప్పడం లేదు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి దిగుబడి బాగానే వచ్చినా పెట్టుబడులు మాత్రము రెట్టింపు అయ్యాయి. మార్కెట్‌లో కూడా సరైన ధర లభించడకపోవడంతో రైతుకు కనీళ్ల తప్పడంలేదు.

**43,050ఎకరాల్లో పత్తి సాగు**

మండలంలో 43,050ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. వివిధ తుపాన్‌ల కారణంగా అక్టోబర్ చివరి వారం వరకు కూడా వర్షాలు పడటంతో పంట దిగుబడి బాగానే వస్తోంది. కొంత మంది రైతులకు ఇప్పటికే ఎకరాకు 10 క్వింటాళ్లు రాగా కొంత మందికి 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. అయినా రైతులు సంతోషించలేక పోతున్నారు. దీనికి ప్రధాన కారణం పెరిగిన పెట్టుబడి ఖర్చులు, మార్కెట్‌లో పత్తికి గిట్టుబాట ధర లేకపోవడం. పత్తి పంట ప్రారంభం నుంచి కూడా కనిష్ఠ ధర రూ.5,400 పలుకుతుండగా గరిష్ఠ ధర రూ.7వేల వరకు మాత్రమే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


పత్తిని తీస్తున్న కూలీలు


పత్తి పొలంలోనే తూకం వేస్తున్న దృశ్యం

**పెరిగిన కూలి రేట్లతో అదనపు భారం**

పత్తి రైతులు ఎకరాకు సుమారు రూ.35వేల వరకు పెట్టుబడి రూపంలో ఖర్చు పెట్టారు. అయితే ప్రస్తుతం మార్కెట్ ధర అంతంతం మాత్రంగానే ఉండగా పత్తిని తీయడానికి పెరిగిన కూలి ఆందోళనకు గురి చేస్తోంది. స్థానికంగా కూలీలకు డిమాండ్ ఉండటంతో పత్తిని తీయడానికి ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఇక కౌలుకు సాగు చేసిన వారి పరిస్థితి మరీ దారుణంగా తయ్యారయ్యింది. కౌలుతో పాటు పెట్టుబడి తీసి ఖర్చులకు డబ్బులు మిగిలే పరిస్థితి లేదని కౌలు రైతులు వాపోతున్నారు. తమను ఆ భగవంతుడే కాపాడాలని బోరుమంటున్నారు.

**పత్తి తీయడం భారంగా మారింది**



పండిన పంటను ఇంటికి తీసుకుని రావడానికి చాల కష్టాలు తప్పడం లేదు. ఈసారి పంట బాగా పండిన పత్తి తీయడం భారంగా మారింది. కేజీ రూ.10 నుంచి రూ.13 వరకు ఉండడంతో ఎకరాకు పత్తి తీయడానికే రూ.12 నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతోంది. పంట బాగా పండినా సంతోషం లేకుండా పోయింది. ప్రతి ఏడాది రైతులకు కష్టాలు తప్పడం లేదు.
– రంజాన్, కౌతాళం

**క్వింటా రూ.1,300 చొప్పన పత్తిని తీయిస్తున్నా**



ఈ ఏడాది పత్తి పంట బాగా పండిన కూలిల రూపంలో 20శాతం వరకు పత్తిని తీయడానికి వెచ్చించాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక క్వింటా పత్తి రూ.1300 ప్రకారం మాట్లాడి కూలీలతో తీయిస్తున్నా. ఇంత దారుణ పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. ఎకరాకు ఖర్చు రూ.30వేల వరకు చేయడమే కాక మళ్లీ పత్తి తీయడానికి అదనంగా భారం పడుతుంది. దీంతో ఖర్చులు ఎకరాకు రూ.50వేల వరకు పెరిగింది. దీంతో పంట పండిన లాభం లేకుండా పోయింది.
– చెన్నబసవ, కౌతాళం

**లాభం రావడం లేదు**



ఒక ఎకరాలో పత్తి పంట సాగు చేశాను. లాభం వచ్చినట్లు కనబడడం లేదు. పత్తిని తీయడానికి కూలీలకు డబ్బు చాలా పోతున్నాయి. పెట్టుబడులు పెరిగాయి. ధర కూడా అంతంతమాత్రంగా ఉంది. వ్యవసాయం కన్నా కూలీ పనులకు వెళ్లి బతకడం ఎంతో మేలు.
– వెంకోబ, కౌతాళం

### ఒత్తిడి తగ్గించాలి

ఆదోని సెంట్రల్: అపార్ ఐడి నమోదు చేయడంలో ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడిని తగించాలని ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటి సభ్యులు మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. సోమవారం ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నమోదు చేయడానికి సర్వర్ ప్రాబ్లమ్స్ ఉన్నాయన్నారు. ముందుగా సర్వర్ సమస్యలు తలెత్తకుండా సరిచేయాలన్నారు. నాయకులు రామాంజినేయులు, సుధాకర్, షేక్షావలి, పులి ఆంజనయ్య, గణేష్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నందవరం : మండల కేంద్రం నందవరం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సుందర రాజు సోమవారం రోడ్డు ప్రమాదం గాయపడ్డాడు. స్థానికులు తెలి పిన మేరకు వివరాలు.. సొంత పనుల నిమిత్తం ఎమ్మిగనూరుకి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా ము గతి గ్రామ దాటిన తరువాత ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొనడంతో గాయాలయ్యా యి. అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### పట్టణ సీఐ బదిలీని రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా కాపాడిన పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి అక్రమ బదిలీని వెంటనే రద్దు చేయాలంటూ పలు ప్రజా,విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీసీఐఎల్ నాయకుడు గణేష్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రసన్నకుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రంగస్వామి, హెచ్ఆర్సీ రైట్ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ డివిజన్ అధ్యక్షుడు అజిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. సోమప్ప సర్కిల్‌లో ఆందోళన చేశారు.

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. అలాగే కార్యాలయ ఆవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీపీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, డీఎల్‌డీఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గొడవలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెద్దకడబూరు: గొడవలకు దూరంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామాన్ని సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలనే ప్రాణాలు పోయేవరకు తీసుకొచ్చి, కేసులు కావడం వల్ల నష్టపోతున్నారన్నారు. గొడవలకు వెళ్లేముందు తన జీవతం లేదా తన కుటుంబం గురించి కొంతసేపు ఆలోచిస్తే చాలావరకు నేరాలు తగ్గుతాయన్నారు. సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి


కూరగాయల స్టాల్

కోసిగి: ప్రకృతి వ్యవసాయంతో రుచికరమైన, నాణ్యమైన కూరగాయల దిగుబడి వచ్చిందని కొల్మాన్‌పేట, దుద్ది గ్రామ రైతులు నాగరాజు, తాయన్న, హనుమంతు, కృష్ణయ్య, కృష్ణ, సతీష్ తెలిపారు. సోమవారం కోసిగి స్త్రీ శక్తి భవన కార్యాలయం ఎదుట కర్నూలు డీపీఎం ఆదేశాల మేరకు కొల్మాన్‌పేట యూనిట్ రాజమ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

## అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడులు

పెద్దకడబూరు : సాధారణ పద్ధతి కంటే అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం వల్ల రెండు క్వింటాళ్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన్ కేంద్రం బనవాసి సమన్వయకర్త డాక్టర్ కే.రాఘవేంద్ర చౌదరి, సీఐసీఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి.వలర్మత, మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. కృషి విజ్ఞాన్ కేంద్రం బనవాసి, కుంద్ర పత్తి పరిశోధన స్థానము నాగపూర్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో సోమవారం అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తి పొలాల్లో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం వల్ల ఎకరాకు 14 వేల నుంచి 15వేల మొక్కలే ఉంటాయని, పంట కాలం కూడా సాధారణ పద్ధతి కంటే తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు నాగేంద్ర, నాగిరెడ్డి, బలరాముడు తదితరులు ఉన్నారు.

## కార్పొరేషన్లకు నిధులను కేటాయించాలి


మాట్లాడుతున్న బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు

ఆదోని సెంట్రల్: కులాల ప్రాతిపదికన అభివృద్ధి చెందాలి అంటే ఒక్కో కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లోని మూడు సామాజిక వర్గాల వారికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించడం హర్షణీయమన్నారు. వాల్మీకి, రజక, కురువ సామాజిక వర్గాలకే కాకుండా మిగిలిన సామాజిక వర్గాలకు కూడా నామినేటెడ్ పోస్టులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ డివిజన్ కార్యదర్శి కత్తి హనుమంతరావు, న్యాయ సలహాదారులు లాయర్స్ నల్లారెడ్డి, అలిగేర రామాంజినేయులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జ్ ఏపీఓపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించకుండా తప్పుడు మస్టర్లు పంపిన ఇన్‌చార్జ్ ఏపీఓపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా వీరమ్మను కొనసాగించాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు.

### హామీలను నెరవేర్చాలి

ఆదోని రూరల్/ ఎమ్మిగనూరుటౌన్/నందవరం : సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు బసాపురం గోపాల్, జిల్లా నాయకులు లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘ నాయకులు చిన్నన్న, మాలిక్ ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ ఆధ్వర్యంలో నందవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

### సూపర్ సిక్స్ ఎక్కడ?

పెద్దకడబూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ ఎక్కడ అని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ ప్రశ్నించారు. ఈ నెల 14 చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలంటూ మండలంలోని చిన్నతుంబళం, కల్లుకుంట, బసలదొడ్డి, గవిగట్టు, పెద్దకడబూరు, నౌలేకల్లు గ్రామాలలో సోమవారం ప్రజాపోరు ఆటోజాతా చేపట్టారు.

### కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

నందవరం : ప్రభుత్వం కాటికాపర్ల సమస్యలను పరిష్కరించాలని కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, ఎంపీడీఓ పుల్లయ్యకు వినతిపత్రాన్ని అందించారు. ఆంథోని, దేవరాజు, చిన్నరాజు, మార్క్, స్వామిదాస్ పాల్గొన్నారు.

### పదోన్నతుల్లో న్యాయం చేయాలి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, తమకు న్యాయం చేయాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, పట్టణ శాఖ అధ్యక్షుడు అనిల్ కుమార్ కోరారు. సోమవారం నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ లోపాలను సరిచేసి పదోన్నతులు, డైరెక్ట్ రిక్రూమెంట్ పోస్టులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంటీఎఫ్ నాయకులు కోటన్న, ఆనంద్, సుబేదమ్మ, రేణుకాదేవి, శ్వేత బాయి, ప్రకాశమ్మతదితరులు పాల్గొన్నారు.

### జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

గోనెగండ్ల: ఆదోని పట్టణంలో 12,13 తేదీల్లో జరగబోయే ఏఐఎస్ఎఫ్ జిల్లా 30వ మహా సభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా దావూద్, ఉపాధ్యక్షులుగా భరత్, విజయ్, హరిబాబు, సహాయ కార్యదర్శులుగా ముషారఫ్, హనీఫ్, రాకేష్, కోశాధికారిగా వినోద్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

ఆదోని సెంట్రల్: పట్టణంలో మంగళవారం నుంచి జరిగే ఏఐఎస్ఎఫ్ 30వ జిల్లా మహాసభలకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.

### ఉర్దూ పత్రిక చీఫ్ ఎడిటర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న ఈషాబాషా

ఆదోని అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే భారతరత్న మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ ఉర్దూ అకాడమీ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆదోని పట్టణానికి చెందిన బాజ్మే అదల్ పత్రిక చీఫ్ ఎడిటర్ ఈషాబాషాకు లభించింది. సోమవారం మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అవార్డు పంపిణీ కార్యక్రమం చేపట్టింది. మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ శాసనమండలి చైర్మన్, ప్రస్తుత మైనార్టీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్, మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ షరీన్, ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్‌వలి చేతులమీదుగా ఈసాబాషా అవార్డును అందుకున్నారు.

### ఆటో డ్రైవర్లకు యూనిఫాం తప్పనిసరి

ఆదోని అర్బన్: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. సోమవారం సాయంత్రం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనదారుడికి ట్రాఫిక్ నియమ, నిబంధనలు తెలియజేశారు.

### సోలార్ లైట్ల దొంగ అరెస్ట్


దొంగను అరెస్ట్ చూపుతున్న రూరల్ సీఐ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామ సమీపంలోని సోలార్ ప్లాంట్ దగ్గర సోలార్ లైట్లను దొంగలించిన హనుమంతు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ విక్రంసింహా, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో దొంగ బోయ హనుమంతు అరెస్టును చూపించారు. వారు మాట్లాడుతూ కోటేకల్ ఫారెస్ట్ ప్రాంతంలో కడివెళ్లకు చెందిన హనుమంతు అనే వ్యక్తి అనుమానస్పదంగా తిరుగుతుండగా అరెస్ట్ చేసి అతని దగ్గర నుంచి రూ. 2.40 లక్షల విలువ చేసే 8 సోలార్ లైట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### 13 మందికి క్యాంపస్ నియామకాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో క్యాంపస్ నియామకాలు జరిగినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డా. వీ.వీరన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన జీటెక్ జైనిక్స్ కంపెనీ వారు బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఈఈఈ, సీఎస్ఈ, సీఏఐ బ్రాంచ్‌ల నుంచి 13 విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపికి చేసినట్లు చెప్పారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి


సెక్రటరీపై ఫిర్యాదు పత్రాన్ని ఎంపీడీఓకు అందజేస్తున్న సర్పంచ్ పల్లదొడ్డి కిష్టప్ప, గ్రామస్తులు

నందవరం : మండలంలోని మాచాపురం పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ పల్లదొడ్డి కిష్టప్పతో పాటు గ్రామస్తులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలో జరిగే పనులకు సర్పంచుకు సమాచారం ఇవ్వకుండా పనులు చేపడుతున్నట్లు వివరించారు. డ్రైనేజీలు, కంప చెట్ల తొలగింపు, వీధి దీపాల మరమ్మతులు, తాగునీటి పైపులైన్ మరమ్మతులు వంటి పనులకు సర్పంచు తీర్మానం లేకుండా పనులు నిర్వహించి బిల్లులు చేసుకుంటున్నాడని ఆరోపించారు. సెక్రటరీపై ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే పనులకు సర్పంచుకు తప్పనిసరి సమాచారం అందించాలి. ఆయన ప్రమేయం లేకుండా గ్రామంలో పనులు నిర్వహించకూడదన్నారు. సర్పంచు తీర్మానం లేకుండా బిల్లులు తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

## పార్టీ మారిన కౌన్సిలర్లు రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షుడు బి.దేవా

ఆదోని రూరల్: వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి పార్టీ మారిన కౌన్సిలర్లు వెంటనే రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షుడు బి.దేవా, జిల్లా సెక్రటరీ శ్రీలక్ష్మి, జిలేఖాబీ, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవదాసు డిమాండ్ చేశారు. వారికి సత్తా ఉంటే రాజీనామా చేసి ఇప్పుడు మళ్లీ పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వార్థం కోసం పార్టీ మారి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. ఆయన చేసిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పట్టణంలో మెడికల్ కాలేజ్ నిర్మాణం, ఆరేకల్ వద్ద 5 నుంచి 10వ తరగతి వరకు రెసిడెన్షియల్, మైనార్టీ స్కూల్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు, వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, ఐటీఐ కాలేజీ, డిగ్రీ కాలేజ్, ఇలా అనేక రకాలుగా ఆదోనికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాయన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి


భారీ జాతీయ జెండాతో ర్యాలీ

కౌతాళం: మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో సోమవారం మౌలానా అబుల్ కలాం 136వ జయంతి, విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 150 మీటర్ల జాతీయ జెండాతో పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ సుబ్బారాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థుల దేశ నాయకుల వేశధారణ ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మైనూద్దీన్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, రాజు, భీమేష్, ఈరన్నలు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ మార్గంలో చాపమ్మవ్వ ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామ పెద్దలు భూమి చేపట్టారు. చాపమ్మవ్వ ఆశీర్వాదంతో గ్రామంలో మంచి పంటలు రావడంతో పాటు ప్రశాంతత, అభివృద్ధి జరిగిందన్నారు. చాపమ్మవ్వ జ్ఞాపకార్థం గ్రామస్తులు, ప్రజల సహకారంలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

### సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం


మాట్లాడుతున్న యార్డు సెక్రటరీ, సీసీఐ నిర్వాహకుడు

ఆదోని అర్బన్: పట్టణంలో మద్దతు ధరకు సీసీఐ పత్తి కొనుగోళ్లను సోమవారం ప్రారంభించింది. పట్టణ శివారులోని సిరుగుప్ప రోడ్డులో ఉన్న ఎన్‌డీబీఎల్ ఫ్యాక్టరీలో సీసీఐ పత్తిని కొనుగోళ్లు చేశారు. యార్డు సెక్రటరీ శాంతికుమార్, సీసీఐ జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ అధికారి గౌతమ్ విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుంచి స్థానిక ఎన్‌డీబీఎల్ ఫ్యాక్టరీలో మద్దతు ధర రూ.7,520తో పత్తిని కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేసుకుని 8 శాతం నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని తీసుకురావాలని సూచించారు. చెత్తాచెదారం లేకుండా కేవలం వాహనంలో లూజు మ్రాతమే తీసుకురావాలని, సంచుల్లో తీసుకురావద్దన్నారు. ఫ్యాక్టరీ నిర్వాహకుడు కుబేర్ పాల్గొన్నారు.